నమస్తే తెలంగాణ

మహబూబ్‌నగర్

నారాయణపేట

5 | మహబూబ్‌నగర్, గురువారం 18 ఏప్రిల్ 2024 | MAHABUBNAGAR NARAYANPET




ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి


## బీఆర్ఎస్ ప్రచార రథం ప్రారంభం

గద్వాల, ఏప్రిల్ 17 : జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ ఆవరణలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ ప్రచార రథాన్ని బుధవారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా ప్రచార రథాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్ నరహరి శ్రీనివాసులు, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, రామన్‌గౌడ్, గోవిందు, ధర్మానాయుడు, రఘువర్ధన్‌రెడ్డి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

### ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పార్టీలు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాల్లో గెలుపు కోసం అధికార కాంగ్రెస్ పార్టీతోపాటు బీఆర్ఎస్, బీజేపీ గట్టిపోటీ పడుతున్నాయి. ఈ రెండు సెగ్మెంట్లలో కూడా ముక్కోణపు పోటీ తప్పడం లేదు. మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో బీఆర్ఎస్ అధిష్ఠానం సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డిని బరిలో దింపగా.. కాంగ్రెస్ నుంచి వంశీచంద్‌రెడ్డి, బీజేపీ నుంచి డీకే అరుణ పోటీకి సై అంటున్నారు. ఇక నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో బీఆర్ఎస్ నుంచి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను బరిలో నిలుపగా.. కాంగ్రెస్ నుంచి మల్లు రవి, బీజేపీ నుంచి భరత్ రేసులో ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలే ప్రచార అస్త్రాలుగా బీఆర్ఎస్ అభ్యర్థులతోపాటు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు సన్నాహక సమావేశాలతో జోరు పెంచారు. మోదీ చరిష్మాతో బీజేపీ ప్రచారం నిర్వహిస్తుండగా.. కాంగ్రెస్ మాత్రం వ్యూహ రచనతో అడుగులు వేస్తున్నది. దీంతో ఈ రెండు స్థానాలు మూడు పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారాయి.

- నేడు పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్
- నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



### ఎన్నికలకు పక్కా నిబంధనలు..

అన్ని రకాల అనుమతుల కోసం సువిధ యాప్‌లో దరఖాస్తును 48 గంటల ముందుగా చేయాలి. నామినేషన్ స్వీకరణ చెక్ లిస్ట్ అందజేసి, దాని ప్రకారం సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచారానికి, కరపత్రాలు, పోస్టర్ల ముద్రణలో ఎన్నికల కమిషన్ జారీ చేసిన నిబంధనలు పాటించాలి.

### హోం ఓటింగ్‌పై అవగాహన..

ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు 85 ఏండ్లు పైబడిన వృద్ధులు, పోలింగ్ కేంద్రానికి వెళ్లలేని దివ్యాంగులకు హోం ఓటింగ్ సౌకర్యాన్ని ఈసీ కల్పించింది. హోం ఓటింగ్ రూట్, గ్రామం వారీగా టీంలను ఏర్పాటు చేసి పారదర్శకంగా పోస్టల్ బ్యాలెట్ జారీ చేసి, రాజకీయ పార్టీలకు సమాచారం అందిస్తారు. సాక్ష్యం యాప్ ద్వారా వీల్ చైర్లు, వలంటీర్లను ఏర్పాటు చేస్తారు. సాక్ష్యం యాప్‌పై అవగాహన కలిగించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.

### 'సీ-విజిల్'లో ఫిర్యాదు చేయొచ్చు..


సీ-విజిల్ యాప్‌లో డబ్బు, మద్యం, ఉచిత వస్తువుల పంపిణీపై పౌరులు ఫిర్యాదు చేయొచ్చు. ఫిర్యాదు చేసిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతారు. ఈ యాప్‌లో గనుక ఫిర్యాదు చేస్తే జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి దానిపై పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటుంది. ఇక పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు విద్యుత్, తాగునీరు, టాయిలెట్లు, ర్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. అంతేగాక ప్రతి అసెంబ్లీ నియోజవర్గంలో మహిళలతో నిర్వహించే 5 పోలింగ్, మోడల్ పోలింగ్ కేంద్రాలు, దివ్యాంగులు, యువతతో నిర్వహించేలా.. పోలింగ్ కేంద్రాలను ఒక్కోటి చొప్పున ఏర్పాటు చేయనున్నారు.

- రాజకీయ పార్టీ నాయకుల సన్నద్ధం
- ప్రభుత్వ వైఫల్యాలే ప్రచార అస్త్రాలుగా బీఆర్ఎస్ దూకుడు
- విస్తృతంగా సన్నాహక సమావేశాల నిర్వహణ

# సార్వత్రిక సమరమే..



## ఇక ఇంటి నుంచే.. నామినేషన్లు




వనపర్తి, ఏప్రిల్ 17 : ఎన్నికల ప్రక్రియలో రోజురోజుకూ సాంకేతిక పరిజ్ఞానం మరింత తోడవుతున్నది. సులువుగా ఇంటి వద్ద నుంచి ఓటు నమోదు చేసుకోవడం, అడ్రస్ మార్చుకోవడం, పోలింగ్ కేంద్రాల వివరాలు తెలుసుకోవడం, ఎన్నికల రిటర్నింగ్ కేంద్రాలకు వెళ్లకుండానే అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా నామినేషన్లు దాఖలు చేసేందుకు ప్రత్యేక యాప్‌లను సీఈసీ సిద్ధం చేసింది. అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు మద్దతుదారులతో ర్యాలీగా వెళ్లడం, ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసుకోవడం వంటివన్నీ అదనపు ఖర్చులే. వీటని తగ్గించేందుకు ప్రత్యేకంగా సువిధ యాప్‌ను ఎన్నికల సంఘం అందుబాటులోకి తీసుకొచ్చింది. అలాగే suvidha.eci.gov.in అనే వెబ్‌సైట్‌ను కూడా ఏర్పాటు చేసింది.

### చివరి తేదీలోగా ఇవ్వాల్సిందే..

నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 18 నుంచి ప్రారంభమై 25వ తేదీన ముగుస్తుంది. కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్లు నామినేషన్లు స్వీకరిస్తారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ గద్వాల నుంచి కల్వకుర్తి వరకు ఉన్నది. ఆయా నియోజకవర్గాల వారు పోటీ చేసినా నామినేషన్లు వేసేందుకు నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌కు రావాల్సిందే. ఇంతదూరం రావడం కష్టమనిపించే వారు యాప్‌లో నామినేషన్ పత్రాలను దాఖలు చేయొచ్చు. అయితే, ఎన్నికల కమిషన్ సూచించిన పత్రాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చాల్సి ఉంటుంది. ఆస్తుల అఫిడవిట్ పత్రాలు, నామినేషన్‌ను బలపర్చేందుకు పది మంది వివరాలు నమోదు చేయాలి. వీటికి కావాల్సిన పత్రాలు అందజేసిన తర్వాత నిర్ణీత సమయంలో స్లాట్ బుకింగ్ చేసుకోవాలి. ఈ పత్రాలతో జిల్లా ఎన్నికల అధికారిని కలిసి మూడు సెట్లు అందించాల్సి ఉంటుంది. నామినేషన్ల పరిశీలన, గుర్తుల కేటాయింపు వంటి వాటికి అభ్యర్థులు అందుబాటులో లేకుంటే వారి మద్దతుదారులు హాజరుకావాల్సి ఉంటుంది. వివరాలు తప్పుగా ఉంటే నామినేషన్‌ను తిరస్కరిస్తారు. ఆన్‌లైన్ అవకాశాన్ని వినియోగించుకుంటే అభ్యర్థులకు సమయం, డబ్బులు ఆదా అవుతాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### ఉదయం 11 గంటల నుంచి..

18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. 21 (ఆదివారం) మినహాయించి, మిగతా 7 రోజులు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ చాంబర్‌లో రిటర్నింగ్ అధికారికి నామినేషన్లు అందజేయాల్సి ఉంటుంది. నామినేషన్లు వేసే సమయంలో అభ్యర్థికి సంబంధించి మూడు వాహనాలను మాత్రమే అనుమతిస్తారు.. రిటర్నింగ్ అధికారి చాంబర్‌లో ఒకేసారి ఐదుగురికి మాత్రమే అనుమతినిస్తారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులకు ఒక ప్రపోజర్, గుర్తింపు పొందని పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులకు 10 మంది ప్రపోజర్లు ఉండాలి. ప్రపోజర్లు పార్లమెంట్ నియోజకవర్గంలో ఓటుహక్కు కలిగి ఉండాలి. 26న స్క్రూట్నీ, 29 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుంది. అభ్యర్థులకు కలెక్టరేట్‌లో సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేసి, లేటెస్ట్ నామినేషన్ పత్రం ప్రింట్, అఫిడవిట్ పత్రాలను అందుబాటులో ఉంచారు. నామినేషన్ ఫారం-2ఏ లో, అఫిడవిట్ ఫారం-26లో అందజేయాల్సి ఉంటుంది.

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పార్లమెంట్ ఎన్నికల సమరం మొదలైంది. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఎలక్షన్లను దశల వారీగా ఈసీ నిర్వహించనున్నది. ఇందులో భాగంగా 4వ విడుతలో తెలంగాణలో జరగనున్నాయి. గురువారం ఎంపీ ఎన్నికలకు సంబంధించి రిటర్నింగ్ అధికారులు నోటిఫికేషన్లు విడుదల చేయనున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో రెండు లోక్‌సభ నియోజకవర్గాలకు ఎన్నికలు జరగనున్నాయి. మహబూబ్‌నగర్ ఎంపీ స్థానం జనరల్‌కు కేటాయించగా.. నాగర్‌కర్నూల్ ఎంపీ స్థానం ఎస్సీలకు రిజర్వ్ చేయబడింది. ఈ రెండు పార్లమెంట్ స్థానాలకు జరిగే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఉమ్మడి జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేపట్టింది. ఇప్పటికే ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ ప్రక్రియకు సంబంధించి అధికార యంత్రాంగం ఆయా రిటర్నింగ్ అధికారుల ఆదేశాలతో సన్నద్ధమవుతున్నది. షెడ్యూల్ విడుదల కాగానే ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో అమలు పర్చుతున్నది. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి ఆయా పార్లమెంట్ పరిధిలోకి ప్రవేశించే చోట్ల చెక్‌పోస్టులను ఏర్పాటు చేసింది. మరోవైపు రాజకీయ పక్షాలు కూడా ఈ ఎన్నికలకు సన్నద్ధమవుతున్నాయి. రెండు లోక్‌సభ సెగ్మెంట్లకు సంబంధించి ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించాయి. పార్లమెంట్ ఎన్నికల వేళ పలువురు నాయకులు పార్టీలు మారుతున్నారు. ఇక ఎన్నికల నోటిఫికేషన్ రాగానే నామినేషన్ల పర్వం ప్రారంభం కానున్నది. దీనికి సంబంధించి ఆయా పార్టీలు కదన రంగంలోకి దూసుకెళ్తున్నాయి. ఇప్పటికే పార్లమెంట్ సెగ్మెంట్లలో ప్రచారాలతో హోరెత్తిస్తున్నారు. ఈసారి రెండు పార్లమెంట్ స్థానాల్లో కూడా ముక్కోణపు పోటీ ఉండే అవకాశం ఉన్నది. అయితే ఎవరు గెలుస్తారన్న దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది.



మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, వేదికపై ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

## ప్రభుత్వ అసమర్థతను ఎండగట్టాలి

- సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలి : మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- హామీల పేరిట మోసం చేస్తున్న కాంగ్రెస్ : ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 17 : ప్రభుత్వ వైఫల్యాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని న్యూటౌన్ బీఆర్ఎస్ కార్యాలయంలో సోషల్ మీడియా సమన్వయకర్త ఆశాప్రియ ఏర్పాటు చేసిన సమావేశానికి ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మాజీ మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. రూ.రెండు లక్షల రుణం తీసుకోండి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే మాఫీ చేస్తామని మోసం చేసిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఎకరం పంట కూడా ఎండిపోకుండా రైతులకు సాగునీరందించిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రణాళిక లోపం వల్ల పంటలు ఎండబెట్టి రైతులను రోడ్డు పాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం కనీసం పెట్టుబడి సాయం కూడా అందించకపోవడంతో పంటలు చేతికిరాక అప్పులు తీర్చలేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి తీరా ఆ హామీలను అమలు చేయకుండా తాత్సారం చేస్తున్న విషయాను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు చేరవేసేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నందుకు ఎవరైనా బెదిరించినా భయపడవద్దని మీకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, అదేవిధంగా బీఆర్ఎస్‌పై సోషల్ మీడియాలో ఇతర పార్టీలు చేస్తున్న ప్రచారాన్ని సైతం తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజలందరూ ప్రభుత్వంపై వ్యతిరేకంగా ఉన్నారని పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపిస్తారని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఇద్దరు స్థానికేతరులని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి స్థానికుడని, ఆయనను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం ఎంపీ మన్నె మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసగించి అధికారం చేపటిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలు, రైతులను ఇబ్బందుల పాలు చేస్తున్నదని ఆరోపించారు. ప్రజలు ఇప్పటికైనా కాంగ్రెస్ చేస్తున్న మోసాన్ని గుర్తించి తెలంగాణ అభివృద్ధికి కృషి చేసిన బీఆర్ఎస్‌కు అండగా నిలిచి తనను మరోమారు గెలిపించాలని కోరారు.

## గొరిటలో దారుణం

- కారుతో ఢీకొట్టి హతమార్చేయత్నం
- దాయాదుల పాతకక్షలే కారణం

తిమ్మాజిపేట, ఏప్రిల్ 17 : దాయాదుల మధ్య పాతకక్షల కారణంగా ఓ వ్యక్తిని కారుతో ఢీకొట్టి హతమార్చేందుకు ప్రయత్నించిన ఘటన తిమ్మాజిపేట మండలం గొరిటలో బుధవారం చోటు చేసుకున్నది. స్థానికులతోపాటు ఎస్సై నరేందర్‌రెడ్డి కథనం మేరకు.. గొరిటకు చెందిన ఎండీ అజీజ్, అతని దాయాదులైన జాఫర్ మధ్య పొలం విషయంలో తగాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో 2020లో ఒకసారి ఘర్షణ జరుగగా కేసు కోర్టులో కొనసాగుతున్నది. తాజాగా బుధవారం గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ సమీపంలో అజీజ్ కూర్చొని ఉండగా కారులో వచ్చిన దాయాదులు అతడిని కారుతో ఢీ కొట్టడంతో పాటు కర్రలతో దాడి చేసినట్లు ఎస్సై తెలిపారు. కారుతో గుద్దడంతో సమీపంలోని పొలంలో ఎగిరిపడిన అజీజ్ కాలు విరగగా, కర్రలతో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రుడిని మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు జాఫర్‌తోపాటు, హఫీజ్, మతీన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

## కాంగ్రెస్‌లో వర్గవిభేదాలు

- పార్టీ సీనియర్ నేత బండ్ల చంద్రశేఖర్‌రెడ్డిపై మరోవర్గం దాడి
- కులాల మధ్య చిచ్చు పెడుతున్న ఓ వర్గం
- ఎప్పుడేం జరుగుతుందోనని ప్రజల ఆందోళన

గద్వాల, ఏప్రిల్ 17 : గద్వాల కాంగ్రెస్‌లో మరోసారి విభేదాలు భగ్గుమని ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మార్చి 30వ తేదీన మంత్రి జూపల్లి కృష్ణారావు సాక్షిగా బూత్ లెవల్ సమావేశంలో ఉమ్మడి జిల్లా జెడ్పీ మాజీ చైర్మన్‌పై కాంగ్రెస్‌లోని ఓ వర్గం దాడి చేసిన సంగతి మరువక ముందే మరో సీనియర్ నేత బండ్ల చంద్రశేఖర్‌రెడ్డిపై బుధవారం కాంగ్రెస్‌లోని మరోవర్గం దాడి చేయగా ప్రాణాపాయస్థితిలో ఉన్న ఆయన దవాఖానలో చికిత్స పొందుతున్నాడు.

### గ్రూపు రాజకీయాలు బహిర్గతం..

గద్వాల జిల్లా కాంగ్రెస్‌లో గ్రూపు రాజకీయాలు మరోసారి బహిర్గతం అయ్యాయి. ఆధిపత్యం కోసం రెండు వర్గాలు ప్రయత్నిస్తుండడంతో అది దాడుల వరకు వెళ్లే పరిస్థితి దాపురించింది. అసెంబ్లీ ఎన్నికల వరకు అన్నీ తామై ఎన్నికల్లో నిలబడిన కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా నిలిచి అధికసంఖ్యలో ఓట్లు రావడానికి ప్రయత్నించిన వర్గం ప్రస్తుతం దూరంగా ఉంటూ వస్తున్నది. ఇది జీర్ణించుకోలేని మరోవర్గం వారు దాడులకు ప్రేరేపిస్తున్నట్లు తెలిసింది. అందుకు కారణం కాంగ్రెస్‌లోని ఓ వర్గం ఎన్నికల్లో కష్టపడిన వారిని పొమ్మనలేక పొగబెట్టినట్లు ప్రతి సమావేశంలో వారిని కించపరిచే విధంగా మాట్లాడడంతో వారు అవమానంగా భావించి ప్రత్యేక వర్గాన్ని తయారు చేసుకుంటున్నారు. ఈ మధ్య జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ధరూర్ మండలానికి చెందిన ప్రధాన నేతలను కించపరిచే విధంగా మాట్లాడడంతో వారు మనస్తాపానికి గురై వేరే కుంపటి పెట్టే ఆలోచనలో ఉండగా ఇది జీర్ణించుకోలేని మరోవర్గం వారు ఈ దాడులకు పురిగొల్పుతున్నట్లు పుకార్లు వినిపిస్తున్నాయి.

### కాంగ్రెస్ సీనియర్ నాయకుడిపై దాడి..

మార్చి 30న జరిగిన బూత్ లెవల్ సమావేశంలో తమకు మాట్లాడడానికి మైక్ ఇవ్వాలని అడిగినందుకు మాజీ జెడ్పీ చైర్మన్ బండారి భాస్కర్‌పై కాంగ్రెస్‌లోని ఓ వర్గం దాడి చేశారు. ఆ ఘటన మరువకముందే బుధవారం పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ప్రచార రథం ఎక్కడానికి ప్రయత్నించిన బండ్ల చంద్రశేఖర్‌రెడ్డిపై కాంగ్రెస్‌లోని ఓ వర్గం దాడిచేసి తీవ్రంగా గాయపర్చగా చికిత్స నిమిత్తం ఆయనను గద్వాలలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. గద్వాల నియోజకవర్గంలో ఇప్పటివరకు అన్ని గ్రామాల్లోని ప్రజలు కుల మతాలకు అతీతంగా ప్రశాంత వాతావరణంలో జీవనం సాగిస్తుండగా ప్రస్తుతం ఆ వాతావరణాన్ని కొందరు రాజకీయ ముసుగులో కలుషితం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఈ మధ్య బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన వారికి అక్కడ తగిన ప్రాధాన్యత దక్కడం లేదని దీంతో తాము ఎందుకు కాంగ్రెస్‌లో చేరామా? అని వారు లోలోపల మదనపడుతున్నట్లు సమాచారం.

### దాడి ఉద్దేశపూర్వకంగానేనా?

గత నెలలో మాజీ జెడ్పీచైర్మన్‌పై, ప్రస్తుతం బండ్ల చంద్రశేఖర్‌రెడ్డిపై జరిగిన దాడి ఉద్దేశపూర్వకంగా జరిగినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. బుధవారం గద్వాల నియోజకవర్గంలోని అన్ని మండలాలతో పాటు గద్వాల జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ఎంపీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ ప్రచారంలో మంత్రి జూపల్లి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి మల్లురవితో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. మల్దకల్ మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించే క్రమంలో ప్రచార రథంపైకి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, ఆయన సోదరుడు బండ్ల రాజశేఖర్‌రెడ్డి ఎక్కే ప్రయత్నం చేయగా మరోవర్గం మీరు ప్రచార రథంపైకి ఎక్కరాదని అడ్డుకున్నట్లు తెలిసింది. అయితే మేము మీరు పిలిస్తే ప్రచారానికి రాలేదని పార్లమెంట్ అభ్యర్థి పిలిస్తేనే వచ్చామని చెప్పడంతో వారి మధ్య మాటామాట పెరగడంతో రామకృష్ణ అనే వ్యక్తి బండ్ల చంద్రశేఖర్‌రెడ్డిపై దాడికి పాల్పడ్డాడు. అయితే మంగళవారం శాంతినగర్‌లో బండ్ల చంద్రశేఖర్‌రెడ్డికి కాంగ్రెస్‌లోని మరో వర్గానికి మధ్య మంత్రి జూపల్లి ముందే వాగ్వాదం జరుగగా మంత్రి వారిని వారించినట్లు తెలిసింది.

అది మనసులో పెట్టుకొని బుధవారం బండ్ల చంద్రశేఖర్‌రెడ్డిపై ప్లాన్ ప్రకారమే దాడి చేసినట్లు ఆరోపణలు వినిస్తున్నాయి. ఏది ఏమైనా రాజకీయాల్లో పోటీతత్వం ఉండాలి కానీ, దాడులు చేసుకునే వరకు రాకూడదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



అనన్యరెడ్డిని అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

## సివిల్ ర్యాంకర్‌కు ఆల సన్మానం

మూసాపేట (అడ్డాకుల), ఏప్రిల్ 17 : యూపీఎస్సీ ఫలితాల్లో 3వ ర్యాంకు సాధించిన దోనూరు అనన్యరెడ్డిని బుధవారం హైదరాబాద్‌లో దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సన్మానించారు. అదే విధంగా ఆమె తల్లిదండ్రులను కూడా అభినందించారు. ఈ సందర్భంగా ఆల మాట్లాడుతూ ప్రతిభ, పట్టుదల ఉంటే ఎదుగుదలను ఎవరూ ఆపలేరని అనన్యరెడ్డి నిరూపించారని కొనియాడారు. తల్లిదండ్రులతోపాటు పొన్నకల్ గ్రామం, అడ్డాకుల మండలం, దేవరకద్ర నియోజకవర్గం, జిల్లాకు పేరు ప్రతిష్ఠలు తీసుకొచ్చినందుకు ఆమెకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ కల్పనావిజయ్‌కుమార్‌రెడ్డి, జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు మహమూద్, జాజాల రాజేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, కావలి కృష్ణయ్య, నర్సింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.


## కమనీయం.. రాములోరి కల్యాణం

- జనసంద్రమైన సిరుసనగండ్ల

చారకొండ/కల్వకుర్తి, ఏప్రిల్ 17 : అపర భద్రాద్రిగా పేరుగాంచిన శిరుసనగండ్ల క్షేత్రం భక్తజన సంద్రమైంది. శ్రీరామ నవమి సందర్భంగా బుధవారం జరిగిన సీతారాముల కల్యాణానికి భక్తులు భారీగా తరలివచ్చి వేడుకను తిలకించి పరవశించిపోయారు. ఆలయ చైర్మన్ రామశర్మ తలంబ్రాలు, పట్టువస్త్రాలు తీసుకురాగా.. మధ్యాహ్నం ఒంటి గంటకు పండితుల వేదమంత్రాలు, భాజా భంజత్రీలు, డప్పు వాయిద్యాల మోతల మధ్య కల్యాణం కమనీయంగా సాగింది. వేడుకను తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. పోలీసులు గుట్టపైకి కేవలం వీఐపీల వాహనాలను మాత్రమే అనుమతించారు. కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, చారకొండ ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో 200 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిఘా పెంచారు.

### ప్రముఖుల హాజరు..

కల్యాణానికి సీఎం రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డి దంపతులు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సతీమణి గువ్వల అమల హాజరయ్యారు. వీరితోపాటు బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కశిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ రాములు, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారితోపాటు ఎంపీపీ నిర్మల, మాజీ జెడ్పీటీసీలు వెంకట్‌గౌడ్, భీముడునాయక్, ఎంపీటీసీలు లక్ష్మణ్‌నాయక్, లక్ష్మణ్, లలిత, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



కల్యాణానికి హాజరైన వివిధ పార్టీల నాయకులు



సిరుసనగండ్లలో స్వామి వారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు